రైతు వ్యతిరేకి రేవంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- టీపీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ మండిపాటు
- రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు ఊరేగిస్తూ నిరసనలు

రంగారెడ్డినగర్: కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలతో తేటతెల్లమయ్యిందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. రేవంత్‌రెడ్డి వాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం సూరారం సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలియజేశారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగింపుగా తీసుకువచ్చి దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తుంటే 8గంటలే చాలని రేవంత్‌రెడ్డి అనడం సిగ్గు చేటన్నారు. రైతాంగం పట్ల కాంగ్రెస్ పార్టీ విధానం స్పష్టమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో రైతులకు సరైన విద్యుత్ అందక చాలా మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. మళ్లీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు 3గంటల విద్యుత్ అందిస్తామని అనడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గతంలో మాదిరిగా రైతులకు ఆత్మహత్యలే తప్ప మరో దారి ఉండదన్నారు. రైతు వ్యతిరేకి రేవంత్‌రెడ్డికి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలే బుద్ధి చెబుతారని హితవు పలికారు.

ప్రజలు కాంగ్రెస్ పార్టీని విశ్వసించరు: ఎమ్మెల్సీ రాజు

కుత్బుల్లాపూర్: ఉచిత విద్యుత్తు పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వెంటనే బేషరుతుగా ఉపసంహరించుకోవాలని... గతంలో రైతులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. గతంలో రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ అదే తరహాలో మరోసారి మోసం చేసేందుకు సిద్ధంగా ఉందని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజలు కాంగ్రెస్ పార్టీని విశ్వసించరని ఎద్దేవా చేశారు. రైతుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు, రుణమాఫీ పథకాలతో ఆదుకుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు సాగుతున్న కేసీఆర్ నాయకత్వంలో వచ్చే ఎన్నికల్లో మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడం ఖాయమని ఎమ్మెల్సీ జోస్యం చెప్పారు.

నేడు దుండిగల్‌లో నిరసన..

కుత్బుల్లాపూర్: తెలంగాణ రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం దుండిగల్ బస్టాప్ సెంటర్‌లో ఉదయం 8గంటలకు రైతులతో కలిసి బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ నిరసనలో రైతులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలను ఖండించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో గురువారం సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి సబ్‌స్టేషన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. సత్యం ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని బ్లూమ్ ఆస్పత్రి, ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, సత్యం ఎన్‌క్లేవ్, సురక్షా ఆస్పత్రి, ఎస్‌సీఎల్ సింధు, దండమూడి ఎన్‌క్లేవ్ ఏరియాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కుత్బుల్లాపూర్ సెక్షన్ పరిధిలో..

విద్యుత్ ఫీడర్ల నిర్వహణ పనుల నేపథ్యంలో గురువారం కుత్బుల్లాపూర్ సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. సూర్యానగర్ ఫీడర్ పరిధిలోని పాపయ్యయాదవ్‌నగర్, రామిరెడ్డినగర్, సూర్యానగర్, పద్మానగర్, బాల్‌రెడ్డినగర్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మధురనగర్, మిథులానగర్ ఫీడర్ల పరిధిలో..

నిజాంపేట్: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మధురనగర్ ఫీడర్ పరిధిలోని రిలయన్స్ ట్రెండ్స్, మోర్ సూపర్ మార్కెట్, అంబ భవానీ హోటల్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...

- మిథులానగర్ ఫీడర్ పరిధిలోని మిథులానగర్, ఆర్‌కే లేఅవుట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సమ్మయ్య తెలిపారు.

చింతల్ డివిజన్ పరిధిలోని పలు ఫీడర్లలో..

చింతల్: పార్క్ వ్యూ ఎంక్లేవ్ ఫీడర్ పరిధిలోని పంచవటికాలనీ, బాపూజీనగర్, భావనకాలనీ, ధనలక్ష్మి కాలనీ, మలానీకాలనీ, గాంధీనగర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

- అంజయ్యనగర్ ఫీడర్ పరిధిలోని అంజయ్యనగర్, వెజిటేబుల్ మార్కెట్ ప్రాంతం, సుబ్బారెడ్డి హౌస్, ఎల్అండ్‌టీ లైన్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు..
- అస్‌బెస్టాస్ హిల్స్, ఏబీకాలనీ, రసూల్ పుర, ప్రగతినగర్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు.. – బాలానగర్, యాజీసీ తదితర ప్రాంతాల్లో 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సెంట్రల్ బ్రేక్‌డౌన్ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు.

అంబులెన్స్‌లో పేషెంట్ ఉంటేనే సైరన్ మోగించాలి

ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లకు ట్రాఫిక్ ఏసీపీ ఆదేశం

కుత్బుల్లాపూర్: ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు అత్యవసర సమయాల్లో మాత్రమే సైరన్లు వేయాలని... అనవసరంగా సైరన్‌లు మోగిస్తూ రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తే మాత్రం కఠినంగా వ్యవహరిస్తామని ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి హెచ్చరించారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సీఐ నాగేశ్వరరావు అధ్యక్షతన పలు ప్రైవేటు అంబులెన్స్‌ల యాజమాన్యాలు, డ్రైవర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల నగరంలో అనవసరంగా సైరన్‌లు మోగించడం, అంబులెన్సులను డ్రైవర్లు రోడ్డు పక్కనున్న హోటళ్ల ముందు ఆపి టీలు తాగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రూల్స్‌ను పాటించడంతో పాటు సైరన్ మోతలపై ఏసీపీ డ్రైవర్లకు ముఖ్య సూచనలు జారీ చేశారు. అంబులెన్స్‌లో ఎవరైనా పేషెంట్ ఉంటేనే సైరన్ వేస్తూ ముందుకు సాగాలన్నారు. డ్రైవర్ మాత్రమే ఉన్నప్పుడు సైరన్ వేయకూడదని సూచించారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించి సైరన్‌లను ఇష్టానుసారంగా వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లతో సమావేశమైన ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, సీఐ నాగేశ్వరరావు

ఆలయాభివృద్ధికి విరాళం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని సీసలబస్తీలో ఇటీవలే నవదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని స్థానిక కార్పొరేటర్ జగన్ ఎమ్మెల్సీని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆలయ అభివృద్ధికి రూ.1.5లక్ష నగదును విరాళంగా అందజేశారు. దీనిని కార్పొరేటర్ బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: మధ్యాహ్న భోజన కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ప్రకటించి, అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. అక్రమ తొలగింపులు అరికట్టి, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకానికి వంట షెడ్లు ఏర్పాటు చేసి, వంట పాత్రలు ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, యూనిఫామ్స్ అందజేయాలన్నారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్, ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పే ప్రభుత్వ కుట్రలను సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉన్ని కృష్ణన్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కేసీఆర్ అసెంబ్లీలో ఏడాది కిందట ప్రకటించినట్లుగా పెంచిన రూ.2 వేలు వెంటనే అందజేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను తక్షణమే ఇవ్వాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళనకు కాంగ్రెస్ నేతలతో సహా విపక్షాలు మద్దతు ప్రకటించినట్లు ఉన్నికృష్ణ పేర్కొన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా నాయకుడు బంగారు నర్సింగరావు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా నాయకులు ప్రేమలత, సువర్ణ, మంగా, సుజాత, షాహిన్, పుష్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

'కరణాల మనోభావాలను దెబ్బతీశారు'

సుభాష్‌నగర్: ఇటీవల విడుదలైన రుద్రంగి చిత్రంలో కరణం పాత్రను అసభ్యంగా చిత్రీకరించి కరణాల మనోభావాలను దెబ్బతీశారని.. భవిష్యత్ ఇలా వ్యవహరిస్తే సహించేది లేదని శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. చలనచిత్రాలు వినోదాన్ని పంచేలా ఉండాలే తప్ప ఎవరి మనోభావాలు దెబ్బతీసేలా ఉండకూడదన్నారు. చిత్ర నిర్మాతలు ఇప్పటికైనా చిత్రంలో కరణాలను కించపరుస్తూ అసభ్యంగా చిత్రీకరించిన దృశ్యాలు వెంటనే తొలగించాలన్నారు. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ వద్ద సమస్యల ఏకరువు



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన వివిధ ప్రాంతాల ప్రజలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు బుధవారం ఎమ్మెల్సీ నివాసానికి వెళ్లి సమస్యలను ఏకరువు పెట్టారు. ఆయన అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.

బడుల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలం

నిజాంపేట్: ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పిలుపునిచ్చిన రాష్ట్ర విద్యాసంస్థలు బంద్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందగా బంద్‌కు మద్దతు పలికాయి. కొన్ని ప్రభుత్వ పాఠశాలలను వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మూసివేయించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందన్నారు. నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, సంక్షేమ హాస్టల్లో వసతులు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకడం ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. జీఓ నం.1ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. రానున్న రోజుల్లో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి శివ, అరుణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరుణ్, విజయ్, అంజి, వాసు, శేఖర్, ఇమ్రాన్, ప్రభాకర్, ముకేశ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నాం

దుండిగల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్

దుండిగల్: మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని దుండిగల్ మున్సిపల్ చైర్ పర్సన్ కృష్ణవేణి అన్నారు. దుండిగల్‌లోని 5వ వార్డులో బుధవారం రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న కుమ్మరి కమ్యూనిటీ హాల్, రూ.15 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ... అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. త్వరలో అన్ని పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, జక్కుల కృష్ణాయాదవ్, ఆనంద్‌కుమార్, గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం ప్రారంభం..

మల్లంపేట నుంచి గండిమైసమ్మ చౌరస్తా వరకు నూతన బస్సు సౌకర్యాన్ని ఆమె ప్రారంభించారు. ప్రతి 30 నిమిషాలకు మల్లంపేట నుంచి గండిమైసమ్మకు వయా బౌరంపేట, శంభీపూర్ నుంచి తిరిగి గండిమైసమ్మ నుంచి అప్పా జంక్షన్ వరకు ఉంటుందని తెలిపారు. ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో గడిచిన మూడున్నర ఏళ్లల్లో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైందని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి ఆరోపించారు. బుధవారం కొంపల్లి బీజేపీ కార్యాలయంలో మున్సిపల్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి అధ్యక్షత జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ పరికరాలు, ప్లాంటేషన్, నీటి శుద్ధీకరణ పేర్లతో దాదాపుగా రూ.4.20 కోట్ల నిధులు పక్కదారి మళ్లాయని, మున్సిపల్ కార్యాలయం రిపేరు, ఫర్నిచర్ కోసం రూ.62 లక్షలు వెచ్చించామని పేర్కొనడం అవినీతికి తార్కాణమన్నారు.

- మున్సిపల్ కార్యాలయ భవన రిపేరుకు మొదటి సంవత్సరం రూ.34 లక్షలు, రెండో సంవత్సరం రూ.15 లక్షలు, ఇతర ఆస్తుల మరమ్మతుల కోసం రూ.40 లక్షలు వెచ్చించినట్లు లెక్కల చూపారన్నారు. ఇలా గత మూడున్నర ఏళ్లుగా రూ.5 కోట్ల పైచిలుకు నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. 14వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా కొంపల్లి మున్సిపాలిటీకి రూ.1.5కోట్ల కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చిందన్నారు. ఈ నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు రాజిరెడ్డి, శకుంతల, రజని, సూర్యకళ పాల్గొన్నారు.

రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే..



దుండిగల్: రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు బుధవారం డి.పోచంపల్లిలోని సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. భూపతిరెడ్డి మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి రైతులకు వ్యతిరేకంగా చిత్రీకరించే ప్రయత్నం బీఆర్‌ఎస్ చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ రైతుల పక్షపాతి అని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు ఉచిత విద్యుత్ అందజేశారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వస్తున్న అవినీతి ఆరోపణలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ పార్టీపై నిందలు మోపుతున్నారని విమర్శించారు. మాజీ మండల అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, నేతలు సదానందం, లక్ష్మి, మద్దికుంట నవీన్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, శివకుమార్‌గౌడ్, డప్పు నరేందర్, అక్బర్, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు లేక కార్మికులకు ఇబ్బందులు



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కుత్బుల్లాపూర్: కనీస వేతనాలు లేక చిన్న, మధ్యతరగతి పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, భూపాల్ అన్నారు. ఈనెల 4 నుంచి 13 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక ప్రాంతాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో జీప్ జాత నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ ఆధ్వర్యంలో బుధవారం జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం జూలై 14 వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు 15ఏళ్లుగా కనీస వేతనాలు సవరించడం లేదన్నారు. ప్రైవేట్ రంగంలో పని చేస్తున్న సుమారు కోటి మందికి పైగా కార్మికుల జీతభత్యాలు పెంచడం లేదని ఆరోపించారు. కలెక్టరేట్ల వద్ద పికెటింగ్‌లు చేయాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. డిమాండ్లను నెరవేర్చే వరకు సీఐటీయూ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు అశోక్, నాయకులు శ్రీనివాస్, సందీప్, దేవదానం, కరుణాకర్, మల్లారెడ్డి, వెంకయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసింది

బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. 'కుత్బుల్లాపూర్ గోస – శ్రీశైలం అన్న భరోసా'లో భాగంగా బుధవారం ఆయన సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని కృషికాలనీ, సాయిబాబా నగర్, శీను బస్తీ, ముత్యాల బస్తీ, పాండు బస్తీ, నర్సింహబస్తీ, రాళ్లకంచ బస్తీల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు సీసీరోడ్లు, డ్రైనేజ్ నీరు రోడ్లపై పారడం, రేషన్‌కార్డులు, పెన్షన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల తదితర సమస్యలను ఆయన దృష్టికి తసుకురాగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

- ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు పెన్షన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించకుండా ఎమ్మెల్యే వివేకానంద్ ప్రగతి యాత్ర చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే బస్తీ ప్రజల సమస్యలు పరిష్కారం చూపుతామన్నారు.



పాండు బస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు.

- ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు ఎంఎస్ వాసు, డివిజన్ అధ్యక్షుడు కంది శ్రీరాములు, డివిజన్ ఇన్‌చార్జ్ గరిగె శేఖర్ ముదిరాజ్, నాయకులు కుమ్మరి శంకర్, భీమరాజు, విజేందర్ రెడ్డి, విగ్నేష్, అంగడి మల్లేష్, హనుమాన్ కచవా, గుబ్బల లక్ష్మీనారాయణ, మారె గణేష్, సంతోష్, కృష్ణాగౌడ్, పాండుగౌడ్, విజయ్‌గౌడ్, రవీందర్‌గౌడ్, పాండుయాదవ్, పవన్, అఖిల్, రోహిత్, రమణ, రంగనాథ్, శ్రీనివాస్, రాజేష్ వర్మ, డాన్సర్ శ్రీను, ప్రవీణ్‌రెడ్డి, రాజు, భరత్ రెడ్డి, మనోజ్ రెడ్డి, చిన్నా, మహిళా నాయకులు శిరీష, శాలమ్మ, కౌసల్య, ఫరీదా, భాగ్యలక్ష్మి, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

బైక్ చోరీ

కుత్బుల్లాపూర్: ఇంటి ముదు నిలిపిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల డివిజన్ రంగారెడ్డిబండకు చెందిన వెంకట్‌రావు మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో తన ఇంటి ముందు (టీఎస్ 08 హెచ్‌ఈ 6943) పల్సర్ బైక్‌ను పార్క్ చేశాడు. బుధవారం ఉదయం 6గంటల ప్రాంతంలో నిద్రలేచి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా సమీపంలో ఉన్న ఉడ్స్‌కాలనీలో చిన్నారుల సైకిళ్లు దొంగించిన ఘటనలు చోటుచేసుకున్నాయని బాధితుడు తెలిపాడు. పోలీసులు రాత్రి వేళ గస్తీ పెంచి దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

అనుమానాస్పదస్థితిలో విద్యార్థి ఆత్మహత్య

దుండిగల్: అనుమానాస్పద స్థితిలో ఓ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం సమస్తీపూర్ జిల్లాకు చెందిన ధర్మేంద్రకుమార్ మెహతో పదేళ్ల క్రితం తన కుటుంబంతో కలిసి నగరానికి వలస వచ్చి సౌరెగూడెంలో నివాసముంటున్నాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఆదేశ్ కుమార్(17) పిల్లలు ఉన్నారు. బుధవారం ఉదయం తల్లిదండ్రులు పనులకు వెళ్లగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో వీరి బంధువు బహదూర్ రాయ్ ఇంటికి వచ్చాడు. డోర్ తీసి చూడగా ఆదేశ్‌కుమార్ ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. తల్లిదండ్రులకు సమాచారం అందించగా వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా విద్యార్థి మృతికి గల కారణాలు తెలియరాలేదు.



ఆత్మహత్యకు పాల్పడ్డ ఆదేశ్‌కుమార్

ఎక్స్‌పైరీ పదార్థాలు వినియోగిస్తున్న వ్యక్తి అరెస్టు

దుండిగల్: ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ కాల పరిమితి ముగిసిన పదార్థాలను వినియోగిస్తున్న ఓ దుకాణదారుడిని ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మల్లంపేటకు చెందిన దామోదర్‌రెడ్డి స్థానికంగా ఉన్న బీసీకాలనీలో ఎస్వీ బేకరీ నిర్వహిస్తున్నాడు. కాగా బేకరీలో కాల పరిమితి అయిపోయిన ఫ్లేవర్స్‌ను ఉపయోగించి కేక్‌లు, ఇతర తిను బండారాలను తయారు చేస్తున్నాడు. సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు బేకరీపై దాడులు నిర్వహించారు. ఎక్స్‌పైరీ ఫ్లేవర్స్‌ను స్వాధీనం చేసుకుని దామోదర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని దుండిగల్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సాక్షి

మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.

9912220366
9912348029